క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

జగద్గిరిగుట్ట: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం సబ్‌స్టేషన్ పరిధి గాంధీనగర్ ఫీడర్‌లోని చింతల్, రంగానగర్, చంద్రానగర్, సాయికాలనీలలో ఉదయం 10 నుంచి 12గంటల వరకు..

◆ మగ్దూంనగర్, శ్రీనివాస్‌నగర్ ఫీడర్ల పరిధిలోని మగ్దూంనగర్, సీసాబస్తీ, పాలాల బస్తీ, రింగ్‌బస్తీ, శ్రీనివాస్‌నగర్, లెనిన్‌నగర్‌లలో మధ్యాహ్నం 1.30గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ రాధాకిషన్ ఓ ప్రకటనలో తెలిపారు.

'బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు'

కుత్బుల్లాపూర్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. సూరారం డివిజన్ సంజయ్‌గాంధీనగర్‌కు చెందిన రోషన్ ఆధ్వర్యంలో 300 మంది బీఆర్‌ఎస్, బీజేపీ కార్యకర్తలు సోమవారం హన్మంతరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

◆ అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవినీతి పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న చేరికలు అందుకు నిదర్శనమని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అవిజె జేమ్స్, సంజీవరెడ్డి, వీరేష్‌గుప్తా, వెంకటేష్, బుజ్జి, సంతోష్ ముదిరాజ్, నర్సింహ, మొండి సాయికృష్ణ, నిఖిల్‌రెడ్డి, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాణికేశ్వరికి పూజలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న మాణికేశ్వరి మాత ఆలయంలో శ్రావణమాస చివరి సోమవార ప్రత్యేక పూజలు చేశారు. అర్చన అభిషేకంతో పాటు చాముండేశ్వరి హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లికార్జునస్వామి, ప్రవీణ్‌స్వామి,నాయకులు జైహింద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తా

జగద్గిరిగుట్ట: సమస్యలు లేని డివిజన్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని సీసాల బస్తీలో జగన్ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కమ్యూనిటీహాల్ నిర్మాణం కూడా వీలైనంత త్వరగా పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ తిరుపతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



దుండిగల్: ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. గండిమైసమ్మ-దుండిగల్ మండల పరిధి డి.పోచంపల్లి సర్వే నం.120లో ఇటీవల అక్రమ నిర్మాణాలు వెలిశాయి. విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ సుచరిత నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రెడ్డి సిబ్బందితో కలిసి మూడు గదులు, నాలుగు బేస్‌మెంట్లను నేలమట్టం చేశారు. అదే విధంగా జీవో నం.59 కింద దరఖాస్తు చేసుకుని డబ్బులు చెల్లించని ఓ ఇంటిని సైతం కూల్చివేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడితే ఉపేక్షించేది లేదన్నారు. ఒకవేళ చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సుచరిత తెలిపారు.

ఉద్యోగులను తొలగించిన కంపెనీపై చర్యలు తీసుకోవాలి



కుత్బుల్లాపూర్: నోటీసులు జారీ చేయకుండా ఉద్యోగులను తొలగించిన ప్రతాప్ హెల్త్ ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కొంపల్లి సింగిల్ విండో మాజీ డైరెక్టర్ జెమ్మి దేవేందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కార్మికులతో కలిసి ఆయన డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా పరిశ్రమను నమ్ముకునే జీవనం సాగిస్తున్నామని అన్నారు. ఉన్నట్టుండి తమను విధుల నుంచి తొలగించడంతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. అద్దె ఇళ్లల్లో ఉంటున్న తమకు ఇళ్ల గడవలేని పరిస్థితి నెలకొందన్నారు. తమకు న్యాయం జరిగేలా పరిశ్రమ యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరారు. కార్మికులు గాయత్రి, దుర్గా,సంధ్య, స్రవంతి తదితరులు ఉన్నారు.

గుంతలు.. చింతలు



ఓక్షిత్ ఎన్‌క్లేవ్ లోని ప్రధాన రోడ్డు దుస్థితి



వాహన రాకపోకలతో నిత్యం రద్దీగా ఉండే జీడిమెట్ల-దూలపల్లి పారిశ్రామికవాడ రోడ్డులో భారీ గుంతలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రోడ్లు గుంతలమయంగా మారాయి. కొన్నిచోట్ల నడవలేని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. వర్షం పడినప్పుడు ఎక్కడైతే ప్రధాన సమస్య ఉందో అధికారులు గుర్తించి శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతున్నారు.

– సుభాష్‌నగర్



ఇటీవల వర్షాలకు మెట్టు కాని గూడా లోని ప్రధాన రోడ్డులో ఏర్పడ్డ గుంతలు



దేవేందర్‌నగర్ ప్రధాన రోడ్డులో ఏర్పడ్డ గోయిల వద్ద హెచ్చరికగా ఏర్పాటు చేసిన చిహ్నాలు

పోలీసుల తనిఖీల్లో గంజాయి పట్టివేత



దుండిగల్: వాహనాల తనిఖీల్లో పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దుండిగల్ పోలీస్స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఒక వాహనంలో భారీగా గంజాయి తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. బాలానగర్ ఎస్‌ఓటీ బృందం, దుండిగల్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై సైబరాబాద్ కమిషనర్ కార్యాలయంలో పూర్తి వివరాలు వెల్లడించే అవకాశం ఉంది. ఇప్పటి వరకు దుండిగల్ పోలీసులు ఈ విషయాన్ని గోప్యంగా ఉంచారు.

ప్రతి వార్డులో మెరుగైన సదుపాయాలు కల్పిస్తాం

• కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పరిపాలనా వికేంద్రీకరణతో ప్రజలకు పాలనను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. దుండిగల్ మున్సిపల్ పరిధి గండిమైసమ్మలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని శాఖల కార్యాలయాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. దీంతో సమస్యలను పరిష్కరించేందుకు దోహద పడుతుందన్నారు. పంచాయతీరాజ్ ఈఈఎం రామ్ మోహన్‌రావు, ఈఈ కె. మోహన్ రావు, డీఈ గంగాధర్, డీఈఈ యాదగిరి, ఏఈ ఆర్.నాగేశ్వర్ రావు, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, సాయి యాదవ్, ఆనంద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రవి యాదవ్, సంపత్ మాధవ్ రెడ్డి, ముకుందం తదితరులు ఉన్నారు.



డీపోచంపల్లిలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

◆ దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డీపోచంపల్లిలోని 6వ వార్డులో ఎమ్మెల్యే ప్రగతియాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు తెలుసుకున్న ఎమ్మెల్యే అనంతరం రూ.20లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

◆ డీపోచంపల్లికి చెందిన 7 మంది లబ్ధిదారులకు రూ.7.00,812 విలువ చేసే కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే వివేకానంద్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు భారం కాకూడదనే సీఎం కేసీఆర్ ఈ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు.

అంగన్‌వాడీలకు రూ.26వేల వేతనం ఇవ్వాలి

దుండిగల్: అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయడంతో పాటు రూ.26వేలను కనీస వేతనంగా చెల్లించాలని సీఐటీయూ దుండిగల్ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి అన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సోమవారం దుండిగల్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగస్వామి మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లకు తక్కువ జీతాలు ఇచ్చి వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని ఆరోపించారు. చాలిచాలనీ జీతాలతో వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి వారి న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధా, సునీత, శోభారాణి, విజయనిర్మల, పద్మావతి, ఆర్.లక్ష్మి పాల్గొన్నారు.



కమిషనర్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ముంపు ప్రాంతాల్లో కౌన్సిలర్ పర్యటన



నాలాను పరిశీలిస్తున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్: ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా పని చేస్తున్నామని.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత, దుండిగల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల ముంపు ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. బౌరంపేట ల్యాండ్ మార్క్–2లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మాదాసు వెంకటేశం, బండారి మహేందర్‌యాదవ్, భరత్‌కుమార్, ఇరిగేషన్ డీఈ సురేశ్, ఏఈ సారా, నేతలు సుభాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, ధర్మారెడ్డి, ప్రేమ్‌కుమార్, సంక్షేమ సంఘం నేతలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా పరిశ్రమ వ్యర్థాల డంపింగ్

• ఇబ్బందులు పడుతున్న ప్రజలు
• పట్టించుకోని పీసీబీ అధికారులు
• చర్యలు తీసుకోవాలని డిమాండ్



పరిశ్రమ నుంచి బయట వస్తున్న రసాయన వ్యర్థాలను పరిశీలిస్తున్న పీసీబీ అధికారులు

జీడిమెట్ల: లక్ష్యాయ్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ నుంచి నేరుగా నాలాలోకి రసాయన వ్యర్థాలను యథేచ్ఛగా డంప్ చేస్తున్నారు. జీడిమెట్ల ఫేజ్–1లో లక్ష్యాయ్ లైఫ్ సైన్సెస్ పేరిట ఓ రసాయన పరిశ్రమ కొనసాగుతోంది. సోమవారం సాయంత్రం సదరు పరిశ్రమ నుంచి సిబ్బంది గుట్టు చప్పుడు కాకుండా మిథనాయిల్‌ను బయటకు వదులుతున్నారు. దీంతో ఒక్కసారిగా తీవ్ర దుర్వాసన రావడం మొదలైంది. దుర్వాసన భరించలేక స్థానికులు ఎక్కడ నుంచి వాసన వస్తుందో అని వెళ్లి చూడగా లక్ష్యాయ్ లైఫ్ సైన్సెస్ పరిశ్రమ నుంచి వస్తున్నట్లు కునుగొన్నారు. ఇంత దారుణంగా వ్యర్థాలను నాలాలోకి డంప్ చేస్తున్నా పీసీబీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సదరు పరిశ్రమపై పీసీబీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మురుగు నీరు అంటున్న పరిశ్రమ యాజమాన్యం..

రసాయనాలను నాలాలోకి డంప్ చేయడాన్ని చూసి ఆగ్రహించిన ప్రజలు ఇది ఏంటని పరిశ్రమ సిబ్బందిని నిలదీశారు. పరిశ్రమ సిబ్బంది అది మురుగు నీరు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. దీంతో అక్కడ ఉన్న ప్రజలు ఈ విషయాన్ని పీసీబీ అధికారులకు తెలియజేశారు. స్పందించిన పీసీబీ అధికారులు పరిశ్రమ వద్ద నుంచి శాంపిళ్లను తీసుకుని సదరు పరిశ్రమపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారలు చర్యలు తీసుకోకపోతే పరిశ్రమ ముందు ధర్నాకు దిగుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.

జలమండలి అధికారుల బదిలీ

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ కార్యాలయంలో పనిచేస్తున్న సూరారం, చింతల్ సెక్షన్ మేనేజర్లు బదిలీ అయ్యారు. సూరారంలో పనిచేస్తున్న రవికుమార్ చింతల్ సెక్షన్‌కు బదిలీ కాగా చింతల్ సెక్షన్‌లో పనిచేస్తున్న అనూష సూరారం సెక్షన్‌కు బదిలీ అయ్యారు. అయితే సూరారంలో పనిచేస్తున్న రవికుమార్ చింతల్ సెక్షన్‌కు బదిలీ అయ్యేందుకు ససేమీరా అంటున్నట్లు కార్యాలయంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. సూరారంలోనే పనిచేసేందుకు సముఖత వ్యక్తం చేస్తూ ఉన్నతాధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లి తనని ఇక్కడే ఉండేలా మద్దతు కూడగట్టే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. చింతల్‌లో పనిచేస్తున్న అనూష తాను ఎక్కడైనా పనిచేసేందుకు సిద్ధమైన అంటూ సూరారం వెళ్లేందుకు సిద్ధం కాగా అక్కడ పనిచేస్తున్న రవికుమార్ గడువు కావాలంటూ ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై జీఎం శ్రీధర్‌రెడ్డిని 'సాక్షి'వివరణ కోరగా బదిలీ అయినప్పుడు ఎక్కడికైనా వెళ్లాల్సిందేనన్నారు. కోరుకున్న చోటే విధులు నిర్వర్తిస్తామంటే ఎలా కుదురుతుందని చెప్పారు.

పేద విద్యార్థులను ఆదుకునేందుకు ముందుంటాం

దుండిగల్: పేద విద్యార్థులను ఆదుకునేందుకు తమ ట్రస్ట్ ఎల్లప్పుడు ముందుంటుందని కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి బహదూర్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నేత కూన శ్రీశైలంగౌడ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి పేద విద్యార్థికి నోటు పుస్తకాలు, గడియారం, గొడుగులతో కూడిన కిట్‌లను పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకుని జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. సమారు 900 మంది విద్యార్థులకు కిట్‌లను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దాసరి శ్యామ్‌రావు, మల్లేష్ యాదవ్, శ్రీనివాస్, ఆకుల విజయ్ సాయి, భరత్‌గౌడ్, రాజు, కేకేఎం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



విద్యార్థులకు కిట్లను అందజేస్తున్న కేకేఎం ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్‌గౌడ్

నిజాయితీ చాటుకున్న కానిస్టేబుల్

జీడిమెట్ల: పోగొట్టుకున్న తన వ్యాలెట్‌ను తిరిగి అందించినందుకు ఓ యువకుడు ఇన్‌స్టాగామ్‌లో కానిస్టేబుల్‌కు ధన్యవాదాలు తెలిపాడు. షాపూర్ నగర్‌కు చెందిన ప్రదీప్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. ప్రదీప్ శనివారం రాత్రి షాపూర్‌నగర్‌లో తన పర్స్ (వ్యాలెట్)ను పోగొట్టుకున్నాడు. అదే రోజు రాత్రి డ్యూటీలో ఉన్న జీడిమెట్ల కానిస్టేబుల్ దశరథ్‌కు రోడ్డుపై పర్స్ దొరికింది. పర్సులో ఉన్న కార్డుల ద్వారా దశరథ్ సదరు యువకుడి అడ్రస్, ఫోన్‌నంబర్ కనుక్కొని ఆదివారం తిరిగి అప్పగించాడు. దీంతో ప్రదీప్ హర్షం వ్యక్తం చేస్తూ సదరు కానిస్టేబుల్ దశరథ్ ఫొటోను ఇన్‌స్టాగామ్‌లో పోస్ట్ చేశాడు. దీంతో ప్రజలు శభాష్ దశరథ్ అంటూ కామెంట్స్ చేశారు.



కూల్చిన ప్రహరీని తిరిగి నిర్మించాలి

నిజాంపేట్: ప్రణవ్ అంటిలాకాలనీలో భారీ వర్షాల కారణంగా ప్రమాదాలు జరగకుండా కూల్చేసిన ప్రహరీని తిరిగి నిర్మించాలని సోమవారం ఓనర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ నాయకులు మేయర్ నీలా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. అదే విధంగా తమ కాలనీలో మౌలిక సదుపాయాలు కూడా కల్పించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటానని మేయర్ వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా 10వ డివిజన్ నాయకులు తమ కాలనీలో కమ్యూనిటీహాల్ నిర్మించాలని మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేశ్,భారతి, లక్ష్మి,రమణ, బక్క మల్లేశ్, దుర్గయ్య, యాదయ్య, రఘురాం తదితరులు పాల్గొన్నారు.



మేయర్ నీలారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

వార్డు కార్యాలయ అధికారుల వివరాలు

రంగారెడ్డినగర్: జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజలకు చేరువలో పాలనను తీసుకువచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ కమ్యూనిటీహాల్‌లో నూతనంగా వార్డు కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను సర్కిల్ కార్యాలయానికి వెళ్లకుండా వార్డు కార్యాలయంలోని అధికారుల దృష్టికి తీసుకువెళ్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. రంగారెడ్డినగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో అందుబాటులో ఉండే ఆయా విభాగాల అధికారుల ఫోన్ల నెంబర్ల వివరాలతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు.

◆ వార్డు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఉదయ్‌కుమార్ (9154197708)
◆ ఇంజినీరింగ్ అధికారి సీహెచ్.స్వాతి (7337367277)
◆ టౌన్ ప్లానింగ్ అధికారి ప్రభావతి (9154299727)
◆ ఎంటమాలజిస్ట్ అబ్దుల్ రజాక్ (9676678711)
◆ కమ్యూనిటీ ఆర్గనైజర్ కవిత (9177473557)
◆ శానిటరీ జవాన్ యాదమ్మ (9177416697)
◆ యూబీడీ సూపర్‌వైజర్ రజిత రావు (8919104950)
◆ స్ట్రీట్ లైట్ ఇన్‌వార్జ్ కృష్ణ (7013391474)
◆ జలమండలి అధికారి చందర్ (9490101454)
◆ టీఎస్ఎస్‌పీడీసీఎల్ అధికారి దుర్గాచారి (9912317818)

దస్తగిరి కుంటలో వ్యక్తి మృతదేహం లభ్యం



దస్తగిరి కుంటలో లభించిన గుర్తు తెలియని మృతదేహం

నిజాంపేట్: దస్తగిరి కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం సోమవారం ఉదయం చెరువులో తేలింది .దీంతో స్థానికులు పోలీసులు, మున్సిపల్ అధికారులకు సమాచారం ఇచ్చారు. కుంట వద్దకు చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

రెండు రోజులగా గాలించినా లభ్యం కాని మృతదేహం..

శనివారం రాత్రి చెరువులో దూకడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. అతడి కోసం రెండు రోజులుగా చెరువులో తీవ్రంగా గాలించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ లభించలేదు. సోమవారం ఆయన మృతదేహం చెరువులో తేలింది. ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఎవరు? ఎందుకు ఆత్మహత్యకు పాల్పడ్డాడు? అనే విషయాలు ఇంకా తెలియాల్సి ఉంది. మృతుడి కుటుంబసభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని బాచుపల్లి ఎస్‌హెచ్‌ఓ సుమన్‌కుమార్ తెలిపారు.

టీటీడీపీ అధ్యక్షుడు కాసానికి అస్వస్థత

ప్రస్తుతం కోలుకుంటున్నట్లు తెలిపిన వైద్యులు



నిజాంపేట్: తెలంగాణ తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ అస్వస్థతకు గురయ్యారు. రెండు రోజులుగా దగ్గు, జలుబుతో పాటు శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. శనివారం సాయంత్రం నుంచి ఆస్పత్రిలో కాసానికి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు నాయకులు ఆస్పత్రికి వెళ్లి కాసాని జ్ఞానేశ్వర్‌ను పరామర్శించారు.

వైభవంగా దుండిగల్ బోనాలు



బోనాలతో వస్తున్న మహిళలు

దుండిగల్: బోనాల ఉత్సవాలను సోమవారం వైభవంగా నిర్వహించారు. దుండిగల్ గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో శ్రావణమాస అక్కమహంకాళి బీరప్ప కామరాతి బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కురుమ సంఘం నేతలు బండారి మహేశ్, కుంటి గిరీశ్. కుంటి వెంకటేశ్, కొత్తపేట శ్రీనివాస్, ముత్యాలు, నర్సింహ, యాదయ్య, బీరయ్య, రమేశ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠాపన..

దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి చంద్రశేఖర్‌రెడ్డి కాలనీలో ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దీవెనలు అందరిపై ఉండాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నేతలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

